క్లుప్తంగా

నేడు గోదాదేవి కల్యాణం

కొత్తూరు: మండలంలోని పెంజర్ల గ్రామంలో ప్రసిద్ధి గాంచిన అనంత పద్మనాభస్వామి ఆలయంలో నేడు(మంగళవారం) గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని దైవకృపను పొందాలని వారు కోరారు.

సర్వే రెమ్యూనరేషన్ వెంటనే ఇవ్వాలి

ఎస్‌జీటీ జిల్లా అధ్యక్షుడు గణేశ్

చేవెళ్ల: గత నవంబర్‌లో ప్రైమరీ స్కూల్ టీచర్లతో రాష్ట్ర వ్యాప్తంగా చేయించిన కులగణన సర్వేకు సంబంధించిన రెమ్యూనరేషన్‌ను ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని ఎస్‌జీటీ జిల్లా అధ్యక్షుడు గణేశ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం వారు చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ.. సర్వే కాలానికి సంబంధించిన రిమ్యూనరేషన్‌ను విడుదల చేసినట్లు ప్రభుత్వం లెక్కలు చూపించినా ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల ఖాతాల్లో ఇంత వరకు డబ్బులు జమ కాలేదన్నారు. ఎన్యుమరేటర్లకు రూ.10వేలు, సూపర్‌వైజర్లకు రూ.12వేలు ఇస్తామని ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ మేరకు డబ్బులను వెంటనే విడుదల చేయాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం



గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

షాబాద్: పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మేడికవర్ ఆస్పత్రి డాక్టర్ అచ్చుత్‌రావు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో శ్రీరామదూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 310 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం రోగులకు ఉచితంగా అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కాలేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణ, శ్రీకాంత్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నీ



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

కొందుర్గు: మండల కేంద్రంలో గత రెండు రోజులుగా కొనసాగిన 18వ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ ఆదివారం రాత్రి ముగిసింది. ఓపెన్ టూ ఆల్ విభాగంలో హుబ్లీ రైల్వేస్ జట్టు విజేతగా నిలిచి రూ.50వేల నగదు బహుమతిని అందుకుంది. కాగా రెడ్ ఆర్మీ జట్టు ద్వితీయ స్థానం సాధించి రూ.25వేలు, కర్ణాటక జట్టు తృతీయ స్థానం పొంది రూ.15వేల నగదు బహుమతులతో పాటు షీల్డులు అందుకున్నారు. ఇక రూరల్ విభాగంలో షాద్‌నగర్ మజీద్ జట్టు ప్రథమ, పాపిరెడ్డిగూడ జట్టు ద్వితీయ, షాద్‌నగర్ బిన్నీ రైస్‌మిల్ జట్టు తృతీయ బహుమతులు అందుకున్నాయి. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ హాజరయ్యారు. టోర్నమెంట్ ముగిసిన అనంతరం ఎమ్మెల్సీ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులతో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సేవలతో జీవన ప్రమాణాలు మెరుగు

ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: కార్పొరేట్ సంస్థలైన అమెజాన్ వంటి సంస్థలు సమాజాభివృద్ధిలో కీలక భూమిక పోషించడం గొప్ప విషయమని ఎమ్మెల్యే సబితారెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేటలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ సంస్థ చేపట్టిన పలు అభివృద్ధి పనులను సోమవారం ఆ సంస్థ గ్లోబల్ డేటా సెంటర్ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ సెర్జియో లొరెయిరో, ఏషియా పసిఫిక్, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా డేటా సెంటర్ ఆపరేషన్స్ డైరెక్టర్ సాజీ పీకే, ఇండియా డేటా సెంటర్ ఆపరేషన్స్ డైరెక్టర్ ఆదిత్యచౌదరితో కలిసి ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఓపెన్ జిమ్, జాగింగ్ ట్రాక్, ఆర్‌ఓ ప్లాంటు, పునరుద్ధరించిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్పొరేట్లు సమాజ సేవలో భాగంగా చేపట్టే పనులతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయన్నారు. అమెజాన్ వెబ్ సర్వీస్ సంస్థ చేపట్టే అభివృద్ధి పనుల ద్వారా సమాజంపై సానుకూల ప్రభావం చూపుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్లకు కొత్తరూపు

- కొత్తూరులో ఊపందుకున్న రోడ్డు విస్తరణ పనులు
- వైజంక్షన్ నుంచి పాత జాతీయ రహదారి పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు, స్థానికులు



పూర్తయిన వై జంక్షన్-రైల్వే వంతెన రోడ్డు



వేగంగా జరుగుతున్న పూలే-జేపీదర్గా రోడ్డు పనులు

కొత్తూరు: పట్టణంలో రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడం.. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో తరచూ ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కాగా గతేడాది ప్రారంభమైన రోడ్డు వెడల్పు పనులు పూర్తికావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు నెమ్మదిగా తగ్గుతున్నాయి. పట్టణ సమీపంలోని వైజంక్షన్ కూడలి నుంచి పాత జాతీయ రహదారి మీదుగా షాద్‌నగర్ వెళ్లే రోడ్డు గుంతలమయంగా ఉండడంతో గతంలో ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. తాత్కాలికంగా గుంతలను పూడ్చడానికి నాయకులు మట్టిని పోయడంతో వాహనాల రాకపోకల సమయంలో విపరీతమైన దుమ్ము కారణంగా పట్టణంలో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం వైజంక్షన్ కూడలి నుంచి రైల్వే వంతెన వరకు సీసీరోడ్డు పనులు పూర్తికావడంతో వ్యాపారులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వేగంగా రోడ్డు పనులు

కొత్తూరు పట్టణంలో ఇప్పటికే జాతీయ రహదారి వైజంక్షన్ కూడలి నుంచి రైల్వే వంతెనవరకు సుమారు రూ.5 కోట్లతో చేపట్టిన నాలుగు లేన్ల రోడ్డు పనులు పూర్తయ్యాయి. హెచ్‌ఆర్‌డీసీ నిధులు రూ.18కోట్లతో గత నెలలో పట్టణంలోని పూలే విగ్రహం నుంచి వినాయక స్టీల్ కూడలి, ఎస్సీ కాలనీ నుంచి చేగూరు వరకు సుమారు రూ.32కోట్లతో చేపడుతున్న రోడ్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ రోడ్డు పనులు పూర్తయితే పట్టణం నుంచి జాతీయ రహదారి, కుమ్మరిగూడ, ఫాతీమాపూర్, అక్కివానిగూడ, చేగూరు వెళ్లే వాహనదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

స్థానికుల హర్షం..

కొత్తూరు పట్టణంలో పారిశ్రామికవాడ ఉండడంతో ఇక్కడ నివాసం ఉండే వారితో పాటు ఆయా ప్రాంతాల నుంచి నిత్యం ఎంతో మంది రాకపోకలు కొనసాగిస్తుంటారు. పట్టణంలో సుమారు 18 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. జనాభాకు తగ్గట్లుగా మార్కెట్ సదుపాయం అందుబాటులో లేని కారణంగా చిరు వ్యాపారులు రోడ్లపైనే వ్యాపారులు కొనసాగిస్తున్నారు. అసలే రోడ్లు ఇరుకుగా ఉండడం చిరు వ్యాపారులు కొంతమేర ఆక్రమిస్తుండడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం పట్టణంలో ఎక్కువగా రద్దీ ఉండే పెంజర్ల, పాత జాతీయ రహదారి రోడ్డు పనులు పూర్తయ్యాయి. జేపీదర్గా, కుమ్మరిగూడ రోడ్డు పనులు సాగుతున్నాయి. రోడ్డు పనులు పూర్తయితే ట్రాఫిక్ ఇబ్బందులు తీరడంతో పాటు పట్టణం కొత్త రూపాన్ని సంతరించుకుంటుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పనులకు సహకరించాలి



పట్టణంలో ఇరుకుగా ఉన్న రోడ్ల విస్తరణ పనులు వ్యాపారులు, భవనాల యజమానులకు ఇబ్బందులు లేకుండా జరుగుతున్నాయి. కొత్తగా విస్తరిస్తున్న రోడ్డు పనులకు ప్రజలు సహకరించాలి. రోడ్డు సౌకర్యం బాగుంటేనే పట్టణం మరింత అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది.

– సుదర్శన్‌గౌడ్, కాంగ్రెస్ నేత, కొత్తూరు

గడువులోగా పనులు పూర్తి



కొత్తూరు మున్సిపాలిటీలో హెచ్‌ఆర్‌డీసీ నిధులతో చేపట్టిన జేపీదర్గా, కుమ్మరిగూడ రోడ్ల పనులను గడువులోగా పూర్తిచేసే విధంగా కాంట్రాక్టర్‌కు సూచించాం. ఇప్పటికే పెంజర్ల, వై జంక్షన్ కూడలి నుంచి రైల్వే వంతెన వరకు సీసీరోడ్డు పనులు పూర్తిచేశాం. రోడ్డు విస్తరణ పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

సంక్రాంతికి కొత్త కాంతిని తెస్తుంది

- సంక్షేమ పథకాల అమలుకు కేబినేట్ నిర్ణయం
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి పండుగకు కొత్త కాంతిని తెస్తుందని, సంక్షేమ పథకాల అమలుతో పేదల జీవితాలలో వెలుగులు నిండుతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుపేదల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 90 శాతం రైతులకు రుణమాఫీ చేశామని, కొన్ని కారణాలతో కొంత మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు సమన్వయంతో రుణమాఫీని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రజలకు నాలుగు పథకాలను అమలు చేసేందుకు ముఖ్యంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల పంపిణీ పథకాలను త్వరలోనే ఇవ్వబోతుందన్నారు. రైతు భరోసా పథకం కింద సాగుకు యోగ్యమైన భూమికి మాత్రమే రైతు భరోసా అందిస్తామన్నారు. ఈ పథకం కింద ప్రతి ఎకరాకు రూ.12వేలను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పథకం ఈ నెల 26 నుంచి అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి సంవత్సరానికి రూ.12వేలు ఇస్తుందన్నారు. ఇల్లులేని ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లును నిర్మించి ఇస్తామని, ఇందిరమ్మ ఇంటి సర్వేను పారదర్శకంగా చేపట్టామని పేర్కొన్నారు. ప్రభుత్వం కొత్త ఆహార భద్రత కార్డులను అందించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామాల్లో అధికారులు, నాయకులు గ్రామసభల ద్వారా ప్రాజాభిప్రాయ సేకరణ చేపట్టి ప్రభుత్వ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తుందన్నారు. అర్హుల ఎంపికపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే మా దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తుందని, ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులు అవినీతికి పాల్పడితే సహించేది లేదన్నారు. సమావేశంలో నాయకులు కృష్ణారెడ్డి, బాబర్ లీఖాన్, రఘు, చెంది తిరుపతిరెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, బస్వం, ఇద్రీస్, సురేష్‌రెడ్డి, శ్రీనునాయక్, క్యాసెట్ శ్రీను, అందె మోహన్, ముబారక్, అప్పి పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం



మొయినాబాద్‌రూరల్: శ్రీకాంత్‌కు నియామకపత్రం అందజేస్తున్న జిల్లా రిటర్నింగ్ అధికారి అశోక్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: బీజేపీ మొయినాబాద్ మండల నూతన అధ్యక్షుడిగా ముర్తుజాగూడ గ్రామానికి చెందిన మాదాపురం శ్రీకాంత్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు నగరంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం బీజేపీ జిల్లా రిటర్నింగ్ అధికారి అశోక్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. బీజేపీలో గత పది సంవత్సరాల నుంచి పనిచేస్తున్నట్లు తెలిపారు. బూత్ అధ్యక్షులుగా, మండల బీజేవైఎం అధ్యక్షులుగా పనిచేసి పార్టీలో కీలకమైన అనుభవం ఉందని తెలిపారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి మండల అధ్యక్షుడిగా తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజాప్రతినిధులు గెలుపొందేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

చేవెళ్ల అధ్యక్షుడిగా అత్తెల్లి అనంతరెడ్డి

చేవెళ్ల: బీజేపీ చేవెళ్ల మండల అధ్యక్షుడిగా అత్తెల్లి అనంతరెడ్డి నియామకమయ్యారు. చేవెళ్లకు చెందిన అనంతరెడ్డి ఇప్పటివరకు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. సోమవారం జిల్లా అధిష్టానం ఆయన సేవలను గుర్తించి మండల అధ్యక్షుడిగా నియమించినందుకు పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా మల్కాపూర్ గ్రామానికి చెందిన దేవుని శర్వలింగం బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు.

షాబాద్ అధ్యక్షుడిగా మద్దూరు మాణెయ్య

షాబాద్: బీజేపీ షాబాద్ మండల అధ్యక్షుడిగా మాద్దూరు మాణెయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి సోమవారం నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి కృషిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ సత్తాచాటుందన్నారు.

వైభవంగా రంగనాథస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేదపండితుడు

కందుకూరు: మండలంలోని కొత్తగూడ పరిధి సీతారామశాస్త్రినగర్‌లో భోగి పండుగను పురస్కరించుకొని గణపతి, లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ ధర్మకర్త తుళ్ల వినాయకరావు ఆధ్వర్యంలో సోమవారం శ్రీగోదా రంగనాథస్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య గోదాదేవి, రంగనాథ స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ట్రాఫిక్ ఇన్‌చార్జి సీఐ గణేశ్

చేవెళ్ల: ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌జార్జి సీఐ గణేశ్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం చేవెళ్లలో వాహనదారులు, డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించాలన్నారు. రోడ్డు దాటేటప్పుడు సిగ్నల్స్‌ను చూసుకొని వెళ్లాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినమైన శిక్షలు, చలాన్లు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్సై చందర్‌నాయక్, అశోక్ తదితరులు ఉన్నారు.

గ్రంథాలయ పాలకవర్గం ఏర్పాటు



నూతన కమిటీ జాబితాను అందజేస్తున్న ఎమ్మెల్యే

నూతన కమిటీ జాబితాను అందజేసిన ఎమ్మెల్యే

షాద్‌నగర్: పట్టణంలోని గ్రేడ్-1 గ్రంథాలయం అభివృద్ధి కమిటీ నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో నూతన పాలకవర్గ జాబితాను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పారదర్శకత, ప్రాముఖ్యతతో నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నామన్నారు. పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 19న నిర్వహిస్తామని తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి జూపల్లికృష్ణారావు హాజరు కానున్నారని తెలిపారు. కమిటీ చైర్మన్‌గా మదన్‌మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్లుగా నక్క బాల్‌రాజ్‌యాదవ్, వీరేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా క్యాసెట్ శ్రీను, సంయుక్త కార్యదర్శులుగా చంద్రశేఖర్, అనిల్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సుదర్శన్‌గౌడ్, సభ్యులుగా జుట్టు అనిల్‌కుమార్, ఫయాజ్, చంద్రశేఖర్‌అప్ప, రాజేశ్, కృష్ణారెడ్డి, శివరాములుయాదవ్, రాజుగౌడ్, రవినాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, బాబర్‌ఖాన్, అగ్గనూరి విశ్వం, రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, బస్వం అప్ప, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ'సమ్మేళనం

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2009–2011లో ఇంటర్(సీఈసీ) చదువుకున్న మిత్రులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని అంబ భవానీమాత దేవాలయం వద్ద 16 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారందరూ ఒకరినొకరూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం తమకు పాఠాలు చెప్పిన అధ్యాపకులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, కళాశాల పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

సంక్రాంతి సందడి..

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. మూడురోజుల వేడుకల్లో భాగంగా సోమవారం భోగి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటి ముంగిట్లో రంగురంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలతో తీర్చిదిద్దారు. చిన్నారులపై భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. చిన్నాపెద్ద తేడాలేకుండా గాలిపటాలు ఎగురవేస్తూ కేరింతలు కొట్టారు. పిండి వంటలు ఆరగించారు. రాత్రి వేళల్లో గ్రామాల్లో నాయకులు, గ్రామస్తులు, మహిళలు కలిసి భోగి మంటలు వేసి సంబరాన్ని పంచుకున్నారు. పండుగ సందర్భంగా రంగులు, పతంగులు విక్రయించే దుకాణాలు కొనుగోలు దారులతో కిటకిటలాడాయి.



కొందుర్గులో చిన్నారికి భోగిపండ్లు పోస్తున్న దంపతులు



షాబాద్‌లో భోగి మంటలు



శంకర్‌పల్లిలో కైట్ ఫెస్టివల్‌లో పాల్గొన్న యువకులు



మొయినాబాద్‌రూరల్: నక్కలపల్లిలో భోగి మంటలు



మొయినాబాద్‌లో పతంగుల షాపులో సందడి